క్లుప్తంగా

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

రాజుపాళెం : రాజుపాళెం గ్రంథాలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 20 వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి ప్రతాపుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వివిధ పోటీలు నిర్వహించి 20న విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు గ్రంథాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

ప్రొద్దుటూరు : వైఎస్సార్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఐ నాయకులు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య మాట్లాడుతూ జిల్లాలో వర్షాభావం వల్ల తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. కరువు జిల్లాగా ప్రకటిస్తే ఉపాధి హామీ పథకం కింద పనులు 150 రోజులకు పెరిగి చిన్న చిన్న వ్యవసాయ కూలీలకు కాస్త ఉపశమనం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి షరీఫ్, సమితి సభ్యులు ఓబన్న, ప్రమీల, సుజాత, రవి చంద్ర, రాజు, నరసింహులు, బాషా, కరీముల్లా, కొండయ్య, అంజి తదితరులు పాల్గొన్నారు.

టపాసుల విక్రయ కేంద్రాల పరిశీలన



నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐలు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక మోడంపల్లె బైపాస్‌రోడ్డులో దీపావళి సందర్భంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన టపాసుల విక్రయ సముదాయాన్ని సోమవారం సాయంత్రం సీఐలు ఇబ్రహీం, రమణారెడ్డిలు పరిశీలించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు వారు సూచించారు. నిబంధనల ప్రకారం వ్యాపారాలు చేసుకోవాలన్నారు.

ఘనంగా దస్తగిరి స్వామి జెండా పండుగ




అన్నదానం నిర్వహిస్తున్న దర్గా కమిటీ

దువ్వూరు : దస్తగిరిస్వామి జెండా పండుగను సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి 9 గంటలకు గ్రామంలోని పురవీధుల్లో వేళతాళాలతో ఫకీర్ల విన్యాసాలతో జెండాను ఊరేగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమలాపురం గఫరియా దర్గా పీఠాధిపతి జహురుద్దీన్ షా హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు దర్గా కమిటీ సభ్యులు ప్రసాదం పంపిణీ చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

చక్రాయపేట : మండలంలోని మహదేవపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని పి.నక్షత్ర రాష్ట్ర స్థాయి త్రో బాల్ పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆ విద్యార్థినిని ప్రధానోపాధ్యాయుడు రవికుమార్‌తోపాటు ఉపాధ్యాయులు అభినందించారు. అక్టోబర్ 31న అన్నమయ్య జిల్లా రామాపురం మండలంలోని నీలకంఠరావుపేట జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచింది. దీంతో రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు.

ఖోఖో పోటీల్లో ప్రతిభ



విజేతలతో ఆర్టీపీపీ సీఈ, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని డీఏవీ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు డీఏవీ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస గుప్తా తెలిపారు. ఆ విద్యార్థులను ఆర్టీపీపీ సీఈ నాగరాజు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఇటీవల ప్రొద్దుటూరులో జరిగిన అండర్–14, 17 విభాగాలలో ఆర్టీపీపీ విద్యార్థులు యతీష్, రాఘవ, రాణా, సురేష్, కిరణ్, హరిత ప్రతిభ చూపారని తెలిపారు. వీరు చిత్తూరు జిల్లాలో ఈ నెల 9, 10, 11 తేదీలలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు.

జనరంజక పాలన కోసమే జగన్ పాదయాత్ర

- యాత్ర ప్రారంభించి ఆరేళ్లయిన సందర్భంగా వేడుక
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : జనరంజకమైన పరిపాలన అందించేందుకే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు ప్రజా సంకల్పయాత్ర చేపట్టారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. జగన్ ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి ఆరేళ్లయిన సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ఆయన యాత్ర చేపట్టారని పేర్కొన్నారు. లోకేష్ పాదయాత్ర ఈవినింగ్ వాకింగ్‌లా జరిగిందని, రోజు సాయంత్ర వేళల్లో మాత్రమే జాగింగ్ తరహాలో వాకింగ్ చేశారన్నారు. జగన్ ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు అలుపెరగకుండా పాదయాత్ర చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ద్వార్శల భాస్కర్‌రెడ్డి, కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు గజ్జల కళావతి, రజకసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పన్నీటి కాశయ్య, కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

■ స్థానిక మైదుకూరు రోడ్డులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేశారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాజుపాళెం మండల అధ్యక్షుడు గుద్దేటి రాజారాంరెడ్డి, సోములవారిపల్లె మాజీ సర్పంచ్ గోపిరెడ్డి రమణయ్య, బొల్లవరం ప్రసన్న ఆలయ కమిటీ చైర్మన్ గోనా ప్రభాకర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ కాకరాడ రాజశేఖర్, నాయీబ్రాహ్మణ సంఘం పట్టణాధ్యక్షుడు సంజీవ్ కర్ణ పాల్గొన్నారు.

ఉత్కంఠగా బండలాగుడు పోటీలు

మైదుకూరు : మున్సిపాలిటీలోని తిమ్మాయపల్లెలో అవధూత కొండయ్య స్వామి జన్మదిన వేడుకల్లో భాగంగా సోమవారం నిర్వహించిన బండలాగుడు పోటీలు ఉత్కంఠగా జరిగాయి. జాక్‌పాట్ విభాగంలో నిర్వహించిన బండలాగుడు పోటీల్లో విజేతలకు నగదు బహుమతులను నిర్వాహకులు అందించారు. మంగళవారం చిన్న బండలాగుడు పోటీలు, మనుషులు గుండు ఎత్తే పందెం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేడు బద్రిపల్లెలో 'ఫ్యామిలీ డాక్టర్'

చాపాడు : మండలంలోని బద్రిపల్లె గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. బద్రిపల్లె గ్రామ సచివాలయం వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేయనున్నట్లు వైద్యాధికారి తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

పోరుమామిళ్ల : పట్టణంలోని హోలీరోసరీ ఉన్నత పాఠశాలకు చెందిన 9 వ తరగతి విద్యార్థి అభిషేక్ ఇటీవల రాయచోటిలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు పీడీ గోవర్ధన్ తెలిపారు. ఎంపికయిన అభిషేక్‌ను సోమవారం పాఠశాల యాజమాన్యం, ఫాదర్ జయపాల్ అభినందించారు.

బాలభవిత కేంద్రంతో పిల్లల భవిష్యత్తుకు భరోసా

ప్రొద్దుటూరు క్రైం : పిల్లల్లో పుట్టుకతో వచ్చిన శారీరక, మానసిక అనారోగ్య సమస్యలకు బాలభవిత కేంద్రంలో పూర్తి స్థాయి సత్వర చికిత్సను అందిస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రి ప్రాంగణంలో రూ.3 కోట్లతో అత్యాధునిక వసతులతో నిర్మించిన జిల్లా సత్వర చికిత్సా కేంద్రం (బాల భవిత కేంద్రం) నూతన భవన సముదాయాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. కేంద్రంలోని ఈఎన్‌టీ, దంత, కంటి తదితర విభాగాలను అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో కడప రిమ్స్ తర్వాత ప్రొద్దుటూరులో బాలభవిత కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. పురిటి పిల్లలు మొదలు 18 ఏళ్ల వయసు గల వారిలో ఎదురయ్యే శారీరక, మానసిక అనారోగ్య సమస్యలకు ఇక్కడ వైద్యం పొందవచ్చని తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ ఆస్పత్రులు అభివృద్ధి చెందాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ హిమదేవి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ రమేష్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాణమ్మ, జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటి సభ్యులు కొండా ధనలక్ష్మి, నరాల మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు బాలభవిత కేంద్రం వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



బాలభవిత కేంద్రం నూతన భవన సముదాయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న సంఘం సభ్యులు

బ్రహ్మంగారిమఠం : కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణంలో జాప్యం, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు పరం కాకుండా చూసేందుకు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్రవ్యాప్తంగా 8న విద్యాసంస్థల బందు పిలుపులో భాగంగా బి.మఠంలో బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు సోమవారం జెడ్పీ హైస్కూల్‌లో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కలివెల రాజశేఖర్ మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ పూర్తి చేయకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడంతో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోయాయన్నారు. విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అప్పచెప్పితే అక్క పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించే అవకాశం ఉందన్నారు ఇందుకోసం ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు ఆదేశాల మేరకు విద్యాసంస్థల బందుకు పిలుపు మేరకు వాల్‌పోస్టర్లు విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎర్రంపల్లె అజయ్, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణకై, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం కోరుతూ ఈ నెల 8న చేస్తున్న విద్యాసంస్థల బంద్ పోస్టర్లను స్థానిక దీప్తి జూనియర్ కాలేజీలో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కాలేజీ డైరెక్టర్లు బాలసుబ్బారెడ్డి, సుదర్శన్‌రెడ్డిచే ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి, ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : వైఎస్సార్ కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని ఈ నెల 8న చేపట్టనున్న విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి వీరపోగు రవి పిలుపునిచ్చారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాసంస్థల బంద్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన విభజన హామీలు అమలు చేయలేదన్నారు. ఉద్యోగాలు లేక యువత ఉపాధి కొరకు విదేశాలకు వెళుతున్నారన్నారు. కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తే లక్ష మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కేంద్రప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ చేపడుతున్న బంద్‌ను విద్యార్థులు, విద్యాసంస్థల యజమాన్యం, ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీలు జయప్రదం చేయాలని పిలుపిచ్చారు.

ఏపీటీఎఫ్ మండల నూతన కమిటీ ఎన్నిక



క్రిష్ణారెడ్డి



ఎం.హరినాథ్

కలసపాడు : పోరుమామిళ్ళ ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాం సుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా కె.క్రిష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.బాలఓబయ్య, ఆర్థిక కార్యదర్శి బి.ప్రభాకర్, కౌన్సిలర్‌గా ఎల్.మల్లేశ్వరి, మండల గౌరవాధ్యక్షుడుగా పి.కిరణ్‌కుమార్, జిల్లా కౌన్సిలర్‌గా ఎం.ప్రభాకర్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

బ్రహ్మంగారిమఠం : ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం పోరుమామిళ్లలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ఉపాధ్యక్షుడు జి.గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడిగా ఎం హరినాథ్(ఎస్ఏ) ప్రధాన కార్యదర్శిగా జె.సుబ్బయ్య(ఎస్‌జీటీ) కోశాధికారిగా పి.నారాయణ(ఎస్ఏ) జిల్లా కౌన్సిలర్లుగా జి.బాబు(ఎల్ఎఫ్ఎల్‌హెచ్‌ఎం) అన్వర్‌బాషా, ఎం.గురుప్రసాద్, ఎం.విమలావతి, కె.సుర్జమ్మలను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఖాదర్ బాషా, గురవయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు డీవైఈఓగా క్రిష్ణప్ప



డీవైఈఓ క్రిష్ణప్పను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రొద్దుటూరు డివిజన్ ఉపవిద్యాశాఖాధికారిగా సోమవారం జి.క్రిష్ణప్ప బాధ్యతలు స్వీకరించారు. మదనపల్లె ఉపవిద్యాశాఖాధికారిగా పని చేస్తున్న ఈయనను రెగ్యులర్ ఉపవిద్యాశాఖాధికారిగా నియమించారు. ఈయన 1987లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొంది తరువాత సీనియర్ అసిస్టెంట్‌గా, సూపరింటెండెంట్‌గా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా తరువాత మదనపల్లెలో ఉపవిద్యాశాఖాధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2016–17లో కడప డీఈఓ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయనకు ప్రధానోపాధ్యాయులు కాశీప్రసాదరెడ్డి, రవి, సత్యబాబు, డీవైఈఓ కార్యాలయ సీసీ నిత్యపూజరెడ్డి, ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి సత్కరించారు.

ఫ్యాక్టరీ ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

జమ్మలమడుగు : ఫ్యాక్టరీలలో జరిగే ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ పరిధిలోని సభా భవనంలో పోలీసు, రెవెన్యూ, ఫైర్ సిబ్బందితో కలిసి పరిశ్రమలలో ప్రమాదం జరిగినప్పుడు స్పందించాల్సిన తీరుపై ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు డివిజన్ పరిధిలో మొత్తం 9 ప్రమాదకరమైన ఫ్యాక్టరీలు ఉన్నట్లు తెలిపారు. ఇవి వాడుతున్న కెమికల్స్ వల్ల బయట ఉన్న ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఫ్యాక్టరీ యాజమాన్యం చేతులు ఎత్తేసి కమిటీ సభ్యులకు సమాచారం ఇస్తే.. వెంటనే కమిటీ సభ్యులు ఈ ప్రమాద నివారణ కోసం చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తుగా అవగాహన లేకపోతే ప్రమాదం జరిగినప్పుడు ఎక్కువగా ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంటుందన్నారు. కాబట్టి అన్ని శాఖల వారికి అవగాహహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇక్బాల్‌బాషా, రెవెన్యూ, పోలీసు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

చింతకొమ్మదిన్నె : చామంతి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యాన శాఖ అధికారిణి కె.జ్యోతిర్మయి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో చామంతి సాగులో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చామంతి రకాల ఎంపిక, తెగుళ్లు, సూక్ష్మ పోషకాల లోపాలు, పూల నాణ్యత, దిగుబడి పెంచడం కోసం తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. హార్మోన్ల వాడకం ద్వారా పూల కోతను మార్కెట్ డిమాండ్‌ను బట్టి, ఆలస్యం లేదా త్వరగా కోతకు వచ్చేలా చేయడం, సస్యరక్షణ, నారు శుద్ధి, ట్రైకోడర్మా ప్రాముఖ్యత, పూలలో నిల్వ శాతం పెంచడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు.

కార్తీక మాసోత్సవాలకు ప్రత్యేక బస్సులు

బద్వేలు అర్బన్ : కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఈ నెల 19, 26, డిసెంబర్ 3, 10వ తేదీల్లో బద్వేలు డిపో నుంచి వివిధ శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరుణాచలం, మహానంది, ఓంకారం, శ్రీశైలం, కాశినాయన క్షేత్రం, సిద్దేశ్వరం, భైరవకోన, నారాయణస్వామిమఠం, నర్రవాడ, లంకమల, నిత్యపూజకోన, పోలతల క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9959225779 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

స్పందనను సద్వినియోగం చేసుకోండి

కాశినాయన : మండల తహసీల్దారు కార్యాలయ ఆవరణలో బుధవారం జిల్లా కలెక్టర్ విజయరామరాజు ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మైథిలి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, గ్రామాల్లో తాగునీటి సమస్యతో పాటు ఇతర సమస్యలు ఉంటే కార్యక్రమంలో పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులతో పాటు మండల స్థాయి అధికారులు కూడా పాల్గొంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పేదల ఇళ్లు కూలగొట్టడం అన్యాయం

పోరుమామిళ్ల : గత 15 సంవత్సరాలుగా రేకుల షెడ్లు నిర్మించుకొని నివాసముంటున్న పేదల ఇండ్లు కూలగొట్టడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, మండల కార్యదర్శి భైరవప్రసాద్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ అన్వర్ బాష అన్నారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా పేదలు ఇండ్లు నిర్మించుకొని జీబీనగర్ పేరుతో నివసిస్తున్నారన్నారు. వారికి ఇంటి పట్టాలు ఇవ్వాలని పలుమార్లు తహసీల్దార్లకు వినతిపత్రం ఇచ్చినా, ఆందోళనలు చేసినా స్పందన లేదన్నారు. పేదలకు న్యాయం చేయాలని, వారికి అక్కడే పట్టాలు ఇవ్వాలని కోరారు.

నేడు రైతుభరోసా నిధుల విడుదల

అట్లూరు : బద్వేలు మండలం బొజ్జిరెడ్డి కల్యాణ మంటపంలో మంగళవారం రైతుభరోసా నిధులు విడుదల కార్యక్రమం నిర్వహించనున్నట్లు బద్వేలు, పోరుమామిళ్ల డివిజన్‌ల వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజు, ఎం.మురళీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టరు సుధా హాజరు అవుతారన్నారు. నియోజక వర్గం పరిధిలోని 37,396 మంది రైతులకు రూ. 14.96 కోట్ల నిధులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారివారి అకౌంట్లకు నేరుగా జమచేయనున్నట్లు తెలిపారు.

బాస్కెట్‌బాల్‌లో సత్తా



విజయం సాధించిన విద్యార్థులతో కరస్పాండెంట్, పీఈటీ

వేంపల్లె : స్థానిక వివేకానంద హైస్కూలు విద్యార్థులు ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో జిల్లా స్థాయి ఖోఖో, బాస్కెట్ బాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారికి సోమవారం ఆ పాఠశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ బాస్కెట్ బాల్ అండర్–17 విభాగంలో ఒ.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్.నరసింహారెడ్డి, కె.ఓంకార్, అండర్–14 విభాగంలో ఎం.ప్రవీణ్‌కుమార్, సి.హాసిని ఎంపియ్యారన్నారు. కార్యక్రమంలో పీఈటీ పద్మజ పాల్గొన్నారు.

పేదల విద్యాభివృద్ధికి కృషి



విజయభాస్కర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి, గీతాశ్రమం అభివృద్ధికి శ్రీ మళయాలస్వామి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ శనివారపు భాస్కర్‌రెడ్డి విశేష కృషి చేశారని ప్రముఖ అవధాని నరాల రామారెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీ కృష్ణ గీతాశ్రమంలో సోమవారం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ శనివారపు భాస్కర్‌రెడ్డి, గంగాదేవి దంపతుల సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమంలోని విద్యాసంస్థల నూతన భవన సముదాయాల నిర్మాణానికి కృషి చేశారన్నారు. శారదా జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సురేష్‌బాబురెడ్డి మాట్లాడుతూ తాను జీవించి ఉన్నప్పుడే ఆశ్రమంలో డీఈడీ, బీఈడీ కళాశాలలను పునరుద్ధరించడానికి ప్రయత్నించారన్నారు. కార్యక్రమంలో వ్యాపార వేత్త సీవీ.సుబ్బారావు, బీఎడ్, డీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్‌లు డాక్టర్ ధనరాజ్, డాక్టర్ నల్లం నాగేశ్వరరావు, శ్రీకృష్ణ ఓరియంటల్ హైస్కూల్ హెచ్ఎం సుదీర్‌కుమార్, ఎలిమెంటరీ పాఠశాల హెచ్ఎం రాజేశ్వరమ్మ, వేదవ్యాస డిగ్రీకళాశాల కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి, ఆశ్రమంలోని విద్యాసంస్థల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా దుస్తుల పంపిణీ

పోరుమామిళ్ల : పోరుమామిళ్లకు చెందిన ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, తోమాస్‌రెడ్డి దంపతులు సోమవారం సంస్థ ప్రతినిధులు ప్రసాదరెడ్డి, శ్రీకాంతరెడ్డి ద్వారా స్థానిక ఓయల్‌ఎఫ్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు 540 మందికి దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుండి ఎఫ్‌సీయన్ సంస్థ క్రిస్మస్, నూతన సంవత్సరాలను పురస్కరించుకొని విద్యార్థులకు ఉచితంగా దుస్తులు అందిస్తున్నదన్నారు. పాఠశాల కరస్పాండెంట్ విజయరాణి, హెడ్మాష్టర్ ఆరోగ్యరాణి మాట్లాడుతూ ఎఫ్‌సీయన్ ప్రతి సంవత్సరం విద్యార్థులకు దుస్తులు, నోటుపుస్తకాలు అందిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నందుకు కృతజ్ఞతలు అన్నారు.

వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

దువ్వూరు : మండల కేంద్రంలోని నేలటూరు గ్రామంలో బొంతపల్లె భాస్కర్‌రెడ్డి అనే రైతు పురుగు ముందు వరి పొలానికి పిచికారి చేయడం వల్ల పంట ఎదుగుదల లేక తాను నష్టపోయానని పురుగుల మందుల దుకాణంపై చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా ఊటుకూరు వ్యవసాయ క్షేత్ర శాస్త్రవేత్తలు డాక్టర్ జాన్సన్, శ్రీవల్లి, వరి పంట పొలాన్ని సందర్శించి మొక్కల నమూనాలను సేకరించారు. రెండు రోజుల్లో నివేదిక అందిస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అమరనాథరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకుడు రామ్‌చరణ్, రైతులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఐ వెంకటరమణ

ప్రొద్దుటూరు క్రైం : విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని త్రీ టౌన్ సీఐ వెంకటరమణ తెలిపారు. స్థానిక దీప్తి జూనియర్ కాలేజీలో సోమవారం ఎల్‌హెచ్‌ఎంఎస్, ర్యాగింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. దిశ యాప్‌ను స్మార్ట్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకొని అత్యవసర పరిస్థితుల్లో రక్షణ పొందాలని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు పట్టాలు మంజూరు చేయాలి

బద్వేలు అర్బన్ : బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని మైదుకూరు మండలం నంద్యాలంపేట గ్రామంలోని కొత్తగంగవరం, వరదాయపల్లె, గాంధీనగర్ ప్రాంతాల్లో జెడ్‌హెచ్‌డీసీ భూములు లీజు పట్టా కలిగి ఉన్న అర్హులైన రైతులకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట రైతుస్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుస్వరాజ్య వేదిక జిల్లా కన్వీనర్ పుత్తాశివారెడ్డి మాట్లాడుతూ గత 40 సంవత్సరాల క్రితం జెడ్‌హెచ్‌డీసీ ద్వారా ప్రభుత్వ భూమికి లీజు పట్టా ఇచ్చారని, ఇంత వరకు యాజమాన్య హక్కు కల్పించలేదన్నారు. సర్వే ద్వారా అనుభవంలో ఉన్న రైతులను గుర్తించి డీకేటీ పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

జాగ్రత్తలు పాటించి పంటను కాపాడుకోవాలి



మినుము పంటను పరిశీలిస్తున్న ఉద్యాన సలహాదారు ప్రసాద్‌రెడ్డి

కమలాపురం: రైతులు వ్యవసాయాధికారులు అందించే సలహాలు, సూచనలు, జాగ్రత్తలు పాటించి పంటలను కాపాడుకోవాలని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని టి.చదిపిరాళ్ల, గొల్లపల్లె గ్రామాల పొలాల్లో సాగులో ఉన్న మినుము పంటను వ్యవసాయాధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సెప్టెంబర్ నెలలో వర్షాలు కురవడంతో రబీ సీజన్‌లో భాగంగా అత్యధికంగా మినుము పంట సాగు చేశారన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు ఎండి పోయే అవకాశం ఉందన్నారు. ఏడీఏ నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత బెట్ట పరిస్థితులను తట్టుకోవడానికి నెలలోపు మినుము పంటకు పురుగు నివారణ మందులతోపాటు లీటర్ నీటికి 5 గ్రాముల 19–19–19ను కలిపి పిచికారి చేయాలన్నారు. నెల తర్వాత పైరుకు పురుగు నివారణ మందులతోపాటు లీటర్ నీటికి 5 గ్రాముల 13–0–45ను కలిపి పిచికారి చేయాలన్నారు. ఇలా చేయడం వల్ల మొక్కకు త్వరగా పోషకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏట సరస్వతి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.